
# సత్యవాక్కు



# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

DECEMBER - 2002

## సంక్షిప్త వార్తలు

2002 అక్టోబరు 29వ తేదీ మంగళవారం ప్రకాశం జిల్లాలో జాషువాగూటం గారు పలు ప్రాంతములు దర్శించి వాక్యపరిచర్య చేసిరి. ఆరోజు ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు శివరాపురం క్రీస్తు సంఘఆవరణలో గొప్పసభ జరిగెను. పరిసర గ్రామముల నుండి అనేకులు హాజరై దేవుని వాక్యమును వినిరి. కూటము అనంతరం వచ్చిన వారందరికీ మంచి విందు జరిగెను. అటు తరువాత ఏడుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. శివరాపురంలో సోదరులు వై. యేసుదాసు గారు క్రీస్తు సంఘముదరపున గట్టిగా పనిచేయుచున్నారు.

అటు తరువాత సాయంత్రం 5 గంటలకు తేళ్లబాడు గ్రామములో జాషువా గూటంగారు వాక్య పరిచర్య చేయగా సోదరులు సి.హెచ్. హనుమంతరావ్ గారు సతీసమేతముగా ఆరోజు సువార్తకులోబడి క్రీస్తు సంఘముతో చేర్చబడిరి. ఆదినమందే వారి తల్లి పుష్పాలు గారు కూడ క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. తేళ్లబాడులో హనుమంతరావ్ గారి ద్వారా జరుగుచున్న పరిచర్య కొరకు ప్రార్థించమనవి.

29వ తేదీ నాడే సాయంత్రం 7 గంటలకు కొలచనకోట గ్రామములో జరిగిన సువార్త కూటములో జాషువాగారు వాక్యపరిచర్య చేసిరి. అక్కడ యమ్. శ్రీనుగారు వాక్యపరిచర్య చేయుచున్నారు. 5గురు కొలచనకోటలో బాప్తిస్మము పొందిరి.

అదే రోజు రాత్రి 9 గంటలకు ఒంగోలు పట్టణం ఈస్ట్‌క్రిష్టియన్ పాలెంలో కూడా జాషువాగారు వాక్యమును ప్రకటించిరి. తదుపరి ఏడుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఈస్ట్‌క్రిస్టియన్ పాలెంలో సోదరులు వై. మరియాదాసు గారు క్రీస్తుసంఘ పరిచర్య చేయుచున్నారు. ప్రకాశం జిల్లాలో వై. యేసుదాసు, మరియా దాసు సోదరులు తమ జీవనోపాధిని సంపాదించుకొనుచు సత్యసువార్తను చాటుచున్నారు. అనేకులను క్రీస్తులోనికి నడిపించు చున్నారు. అట్టివారందరి కొరకు

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 363722
Editor :
**Joshua Gootam**

Pleading for Restoration of First Century Christianity

సంపుటిక 23 డిసెంబర్ 2002 సంచిక 5

# నీవు తిరిగి జన్మించాలి

## (You must be Born again)

పాపియైన ప్రతి మానవుడు మార్పు జెందాలి. పాపము చేయు ప్రతివాడును పాపమునకు దాసుడని యేసుప్రభువు చెప్పారు (యోహాను 8:34). అట్టి మానవుడు తిరిగి జన్మించాలి. పాపరహితమైన జీవితమును అన్వేషించుచు యూదుల మతగురువు ఒకడు యేసునొద్దకు వచ్చాడు. ఆసందర్భము క్రొత్త నిబంధనలో ఇట్లు వ్రాయబడి యున్నది :

"యూదుల అధికారియైన నీకొదేమను పరిసయ్యుడొక డుండెను. అతడు రాత్రి యందు ఆయన యొద్దకు వచ్చి-బోధకుడా నీవు దేవుని యొద్ద నుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము; దేవుడతనికి

తోడైయుంటేనే గాని నీవు చేయుచున్న సూచక క్రియలను ఎవడును చేయలేడని ఆయనతో చెప్పెను. అందుకు యేసు-అతనితో ఒకడు క్రొత్తగా జన్మించితేనేగాని అతడు దేవుని రాజ్యం చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. అందుకు నీకొదేము ముసలివాడైన మనుష్యుడేలాగు జన్మింపగలడు? రెండవమారు తల్లి గర్భమందు ప్రవేశించి జన్మింపగలడా అని ఆయనను అడుగగా యేసు ఇట్లనెను-ఒకడు నీటి మూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యెహోను 3:1-5). ఒకడు నీటి మూలముగాను, ఆత్మమూలముగాను తిరిగి జన్మించుటలో ఏమేమి ఇమిడి యున్నవో గమనించుదాం.

## అక్షయ బీజము

పరలోకమందున్న దేవుడు మన తండ్రి. ఆయన వాక్యమే బీజము. మనము ఆయన వాక్యముద్వారా జనింపజేయబడతాము. "మీరు అక్షయబీజము నుండి పుట్టింపబడిన వారని" అపో. పేతురు చెప్పుచున్నాడు (1పేతురు 1:23). దేవుని బీజమైన వాక్యము ప్రకటింపబడగా మన హృదయాల్లో ఆయన యందు విశ్వాసము జనింపజేయబడతాది(రోమా 10:17). యేసుక్రీస్తయియున్నాడని నమ్ము ప్రతి వాడును దేవుని మూలముగా పుట్టియున్నాడు. పుట్టించిన వానిని ప్రేమించు ప్రతి వాడును ఆయన మూలముగా పుట్టినవానిని ప్రేమించును" (1 యోహాను 5:1).

"తన్ను ఎందరంగీక రించితిరో వారి కందరికి, అనగా తన నామమందు విశ్వాసముంచిన వారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను. వారు దేవుని వలన పుట్టిన వారేగాని రక్తము వలనైనను శరీరేచ్ఛవలనైనను మనుష్యేచ్ఛవలనైనను పుట్టినవారు కారు" (యోహాను 1:12,13). యేసు ప్రభువు నామమందు విశ్వాసముంచు వారికి దేవుని పిల్లలయ్యే అధికారమును దేవుడనుగ్రహించును. దేవుని బిడ్డ

కావాలంటే విశ్వాసము అవసరం. అయితే విశ్వాసము ఒక్కటి మాత్రమే చాలదు. గనుక ఒకడు క్రొత్తగా జన్మించాలంటే దేవుని వాక్యము విని, విశ్వసించాలి. ఒకడు నీటి మూలముగాను, ఆత్మమూలముగాను జన్మించాలని యేసుప్రభు చెప్పారు.

క్రొత్త జన్మలో నిజానికి రెండు భాగాలున్నాయి. ఒకడు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించాలి. గాని దాని అర్థమేమిటి? దీనికి జవాబిచ్చే మరొక సమానాంతర లేఖనాన్ని చూద్దాం. పెంతెకొస్తు దినమున అపొ.పేతురు వేల కొలది యూదులకు క్రీస్తును గూర్చిన సువార్త బోధించాడు. యేసేక్రీస్తని, దేవుని కుమారుడని, ఆయనను వారు సిలువ వేసి చంపించారని పేతురు వారికి బోధించాడు. యేసే రక్షకుడని వారు హృదయములో విశ్వసించి, మేమేమి చేతుము? అని యడిగారు. "పేతురు-మీరు మారు మనస్సుపొంది, పాప క్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని చెప్పాడు (అపొ.కా. 2:38).

ఒకడు పరిశుద్ధాత్మ వాక్యమును విని విశ్వసించగా అతడు ఆత్మమూలముగా తండ్రి వలన జనింపజేయబడతాడు. అట్టివాడు పాపముల విషయమై మారు మనస్సుపొంది, పాపక్షమాపణ నిమిత్తము యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందగా, నీటిమూలముగా జన్మించుతాడు. బాప్తిస్మమునకు ముందు ఒకడు విధిగా మారుమనస్సు పొందాలి. మారుమనస్సు అనగా పాపముల విషయమై మనస్సు మార్చుకొనుట మరియు దేవునికి లోబడుతానని నిశ్చయించుకొనుట. నీటిలో బాప్తిస్మము పొందక ముంధు మారుమనస్సు నొందవలెను. బాప్తిస్మమనగా నీటిలో పూర్తిగా ముంచబడుట. అదొక నీటి సమాధి. యేసు క్రీస్తు సమాధి చేయబడి మూడవ దినమున తిరిగి లేచారు. అట్లే పాపియైన మానవుడు నీటిలో సమాధిచేయబడి తండ్రికుమార, పరిశుద్ధాత్మ నామమున తిరిగి లేస్తాడు.

ఒక నూతన జీవియై జీవిస్తాడు. మారుమనస్సు పొందిన విశ్వాసి పొందే ఈ బాప్తిస్మము పాపక్షమాపణ నిమిత్తం జరుగుతాది.

నీకొదేము సంగతి ఆలోచించండి, అతడొక పరిసయ్యుడు. "పరిసయ్యులును ధర్మశాస్త్రోపదేశకులును యోహాను చేత బాప్తిస్మము పొందక తమ విషయమైన దేవుని సంకల్పమును నిరాకరించిరి" (లూకా 7:29-30). అందువలన నీకొదేము యేసుని అడుగగానే అతడు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో (అనగా క్రీస్తుసంఘములో) ప్రవేశింపలేడని చెప్పారు (యోహాను 3:5).

## చిలకరింపు కాదు

భక్తిపరులమని, క్రీస్తును వెంబడించువారమని తలంచేవారిలో అనేకులు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుటకు నిరాకరిస్తారు. మేము పసిపిల్లలుగా యున్నప్పడే బాప్తిస్మము ఇయ్యబడినదని కొందరు చెబుతారు. మొదటిగా, కొన్ని నీళ్లు నెత్తిమీద చిలకరిస్తే అది బైబిలు ప్రకారము బాప్తిస్మము కాదు. అవి పసిపిల్లలమీదగాని, పెద్దవారిమీదగాని చిలకరించితే అది బాప్తిస్మము కానేరదు. మరి ముఖ్యముగా బైబిలులో పసిపిల్లలకు బాప్తిస్మమిచ్చినట్లు ఉదాహరణగాని ఆజ్ఞగాని ఎక్కడనూ కనపడదు. ఏలయనగా ఒకడు బాప్తిస్మము పొందక ముందు సువార్తను వినాలి, విశ్వసించాలి. పాపముల విషయమై మారుమనస్సు పొందాలి, యేసే దేవుని కుమారుడని నోటితో ఒప్పకోవాలి. అప్పడు నీటిలో ముంచడము పొందాలి. పసిపిల్లలు సువార్తను వినలేరు. గ్రహించుకోలేరు. విశ్వసించలేరు. మారుమనస్సు పొందడానికి వారికి పాపములు యేవీ లేవు; సరిగదా అట్టివారిదే పరలోకరాజ్యమని యేసుప్రభువు చెప్పారు. గనుక చిన్నపిల్లలకు బాప్తిస్మమిచ్చే కార్యక్రమం అంతా బైబిలు విరుద్ధమైనదై మానవకల్పితమే యని గ్రహించుకొందాము.

పసిపిల్లలుగా యున్నప్పుడు మీతల్లిదండ్రులు మీకు చిలకరింపు ఇప్పించిన యెడల మీరు బాప్తిస్మము పొందలేదు. పెద్దవారైనప్పుడు కూడ చిలకరింపు పొందిన యెడల మీరు బాప్తిస్మము పొందలేదు. గనుక ప్రభువైన యేసుక్రీస్తు నామమున పాపక్షమాపణ నిమిత్తమం ఈరోజే బాప్తిస్మము పొందండి. పరిసయ్యులవలె మీయెడల దేవుడు కలిగియున్న సంకల్పమును నిరాకరించవద్దు (యోహాను 12:42-43).

మనము విశ్వసించి, మారుమనస్సుపొంది, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందిన యెడల పరిశుద్ధాత్మయను వరము మనకు వాగ్ధానము చేయబడినది. ఆత్మయైనదేవుడు వాక్యముద్వారా మనలో నివసించును. ఆత్మఫలములు ఫలించుచు మంచి జీవితమును జీవించుటకు సహాయపడును. "మనము నీతిననుసరించి చేసిన క్రియల మూలముగా గాక, తన కనికరము చొప్పననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మమనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను మనలను రక్షించెను. మనమాయన కృపవలన నీతిమంతులమని తీర్చబడి, నిత్యజీవమును గూర్చిన నిరీక్షణను బట్టి దానికి వారసులమగుటకై పరిశుద్ధాత్మను మన రక్షకుడైన యేసుక్రీస్తు ద్వారా ఆయన మనమీద సమృద్ధిగా కుమ్మరించెను" అని తీతు 3:5,6 చెప్పుచున్నది.

యేసుప్రభువు నందు విశ్వాసముంచుము, నీపాపముల విషయమై మారుమనస్సుబొంది క్రీస్తు నామమున పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందుము. అప్పుడు నీవు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించిన వాడవగుదువు.

***

# ఆదాము

(ఆదికాం: 1,2, అధ్యా)

ఆదిమానవుడైన ఆదాము నుండి అనేకమైన ఆధ్యాత్మిక పాఠములను మనము నేర్చుకొనగలము. వాటిని ఇక్కడ పొందుపర్చుదము.

1. దేవుడు అతన్ని భాగ్యవంతునిగ జేసెను. తోట అంతయు అతని స్వాధీనములోనే గలదు.

2. అతనికి లేమి అనునది లేకుండా జేసెను. పండ్లే అతనికాహారము, తోటలోనిదంతయు అతనిదే.

3. అంతయున్ననను అతడు కష్టపడి సేద్యము చేయవలయును. సోమరితనమునకు చోటు లేదు.

4. అతనికి హద్దులు నేర్పాటు చేసెను. ఏది తిన వచ్చునో, ఏది తినకూడదో నిర్ణయించెను. అది అతనికి క్షేమమే గదా.

5. అతని అల్పత్వమును అతనికి తెలియజేసెను. ఆదాము అనగా ఎర్రనిమట్టి మన్ను. ఒక వేళ దేవుడు అతనిని "మట్టయ్యా" అని పిలిచెనేమో.

స్వతంత్రత, హద్దులు క్రైస్తవ జీవితమున కవసరమగునవే. స్త్రీ, పురుషులిరువురు సంతోషముతో కాలము గడుపు చుండిరి. అయినను జరిగిన దేమి?ఏ కారణము చేతనో స్త్రీ ఒంటరిగా తోటలో తిరుగుట సంభవించెను. సాతానుకు సందు దొరికెను. ఆమెను సమీపించెను. ఆమెలో అనుమానమును రేకెత్తించెను. ప్రశ్నవేసెను."ఇది నిజమా? దేవుడు మిమ్ము మంచి చెడ్డల తెలివినిచ్చు చెట్టు పండ్లుతిన కూడ దని చెప్పెనా? (అట్లు చెప్పడే) అనుభావమును వెలిబుచ్చెను.

భూ జంతువులన్నిటిలో సర్పము యుక్తిగలదని ఆయన తెలియజేసెను. సర్పరూపమున ఉన్న సాతాను ధైర్యముగా తన బాణము ఆమెపై విసరివేసెను. ఈ దినములలో కూడా ప్రేమగల దేవుడు నరకములో ఎవరిని త్రోయడు అంటారు. అవును. దేవుడు ప్రేమగలవాడే. రక్షణ షరతులనుల్లంఘించి,

నీకు నీవే నరకము నేర్పరచు కొనుచున్నావు. . అదిస్వయంకృతమే. దేవుడు రెండు మార్గములను నీయెదుట పెట్టినాడు : కుడివైపు, ఎడమవైపు విశాల మార్గము, ఇరుకు మార్గము. నీవు ఏదో నిర్ణయించుకొనుట మీద నీ భవిష్యత్ ఆధారపడి యున్నది.

ఆ పండు తిను దినమున మీరు చచ్చెదరు అని దేవుడు చెప్పగా, "మీరు చావనేచావరు" అని గట్టిగా సాతాను ఉద్ఘాటించెను. ఈ మాటలలో దేవుని అబద్ధికునిగా చేసెను (తీతు 1:4).

ఏలాటి వనికి మాలిన మాటలకైనను సాతాను జడియడు. విశ్వాసముంటేచాలు బాప్తిస్మము మక్కరలేదు అనేవారు ఆలాంటి వారే. ఆలాటి అబద్ధం ఇంకను కొనసాగినది. "మీరు దేవతలవలె నుందురు" అని సర్పము పలికినప్పుడు, దేవుడు అసూయపరుడు మీరు ఉన్నతస్థితికి వచ్చుట కాయనకిష్టము లేదు అని చెప్పనట్టున్నది. అప్పడా స్త్రీ కన్నులు పైకెత్తి చూచెను. మంచి చెడ్డల తెలివినిచ్చు పండ్లేలాగు కన్పించినవి? ఆహారమునకు మంచివి (శరీరాశ), కన్నుల కందమైనవి, (నేత్రాశ), వివేకము నిచ్చు రమ్యమైనవి, (జీవపుడంబము) గా కనబడెను. తన భర్తకు కొన్ని పండ్లు ఇచ్చినప్పుడు ఆతడు ఆలోచన లేకయే తాను తినెను. "శరీరాశ, నేత్రాశ, జీవపుడంబము దేవుని వలన కలిగినవి కాదు అని యోహాను పలికినాడు (1 యోహా 2:16).

అను దినము చూచే పండ్లే గదా, ఆవేళ ఆమెకు అలాగ కన్పించినవి. పండ్లలో మార్పు లేదుగ్గాని ఆమె దృష్టిలో మార్పున్నది. మన ప్రభువుకూడా ఈ రీతినే శోధింపబడెను. కాని ఆయన శోధనను జయించెను.

# ప్రభువు శోధన

ఇవి మత్త4, లూకా4, మార్కు1లో క్లుప్తీకరించబడినది.40 దినములలో ఆయన అనేక రీతుల, మనవలే శోధింపబడెను కాని పాపము లేకుండా నుండెను. మనవలెనే అనుమాట (హెబ్రీ 2:16-18) మనకు ధైర్యమునియ్యవలయును. దేవుని కుమారుడవైతే - ఇది సవాలు. ఈయన నా ప్రియ కుమారుడు అని దేవుడే పలికెను. అయినను ఈ సవాలులో సాతాను యొక్క ధైర్యము కన్పించుచున్నది. లోకములో ఆహార సమస్య ఉన్నది ప్రజలకు ఆహారము పెట్టు అప్పుడు నిన్ను వెంబడింతురు ఆయన రొట్టెవలన సమస్య తీరదు అని సాతాను సలహా నిరాకరించెను. నీవు అద్భుతముల ద్వారా ప్రజలను ఆకర్షించిన వారు నిన్ను వెంబడించుదురు. దేవాలయ శిఖరము నుండి క్రిందికి దుముకుము. అదిచాల ఎత్తయినది నీకు ఏహానియు తగలకుండా దేవుడు చేయును అని చెప్పగా నీవు దేవుని శోధించుట పాపము అని ప్రభువు జవాబిచ్చెను. మూడవ ప్రయత్నం మేమనగ నీవు రాజ్యములను ఏలినచో వారు నిను వెంబడింతురు, ఈ రాజ్యముల నావి, నాకు నమస్కరించినచో అనగా నాకు లోబడినచో నీకిత్తును అనెను. నమస్కారము పొంద దగిన వాడు దేవుడే. నీ పద్ధతులలో నేను రాజ్యముల నేలను. నేను ఏలునవి ఈ లోక రాజ్యములు కాదు. ఆధ్యాత్మిక రాజ్య స్థాపనకై వచ్చితిని. అది దేవుడే కొనసాగించును, అని ఆయన పలికెను. అంతటతో సాతాను తన ప్రయత్నము మాన దలచలేదు. సమయము వచ్చు వరకు (లూకా 4:3) విడిచి పోయెను అని వాక్యములో గలదు. సాతానుకున్న పట్టుదల మనకు పాఠము నేర్పుచున్నది. అపవిత్ర కార్యములు జరిగించుటకు సాతానుకు అంత పట్టుదల ఉన్నచో దేవుని పరిశుద్ధ సేవలో ఉన్న మగకెంతో విశేషముగా పట్టుదల ఉండవలెనుగదా. ఆదాము హవ్వలశోధనకు, వీనికిని పోలికలు గలవు.

1. రాళ్లు రొట్టెలుగా చేయుట - శరీరాశ

2. దేవాలయ శిఖరము నుండి దుముకుట - నేత్రాశ

3. లోక రాజ్యములు చేపట్టుట - జీవపుడంబము

నేడువెవ్వేరు రీతుల శోధింపబడు మనకును ఆయన మాదిరిగా నున్నాడు. (హెబ్రీ 2:17,18). అప్పడు జరిగినదేమి ? వారి కండ్లు తెరువబడెను గాని వారు దేవతలవలే లేరు. తమకు తాము దయ్యములవలె కాన్పించిరి. ఎంతో ఆశాభంగము! ఇంకా జరిగిన దేమి? తాము దిగంబరులమని తెలిసికొన్నారు. అంజూరపు ఆకులతో తమ దిసమెలలను కప్పకొని చెట్ల చాటున దాగిరి. సాయంకాల సయమున యెహోవా దేవుడు వారిని పలుకరింపవచ్చెను. వారిని దర్శించుట నిత్యము జరుగుచుండునేమో.

యెహోవా ఆదామానీవెక్కడున్నావు? అని అడిగినపుడు భయపడి దాగుకొంటిని అని జవాబిచ్చెను. భయము అను నది వారిని ఆవరించినది నాటి నుండి నేటి వరకు లోకమందంతయు భయమను నది లేని వారు లేరు. మనము పాత, క్రొత్త నిబంధనలకు పోలి. కలుతారతమ్యములు కనుగొనుట సరియైన పద్ధతి కాకపోవచ్చు. నేను చూడగలిగినదేమనిన పా.ని, "భయము"తో ప్రారంభించినది. కాని భయపడకుడి అనుమాటలతో క్రొత్తనిబంధన ప్రారంభించినది (లూకా 2:10). మరియు కీర్తనల గ్రంధములో అనేక చోట్ల భయమును తొలగించు దేవుని అభయ వాక్కులను కనుగొందుము. వారు తమ నేరములను సూటిగా ఒప్పకొనలేదు. ఆదాము, స్త్రీ వలన తింటిని అనియు. స్త్రీ సర్పము వలన తింటిని అనియుచెప్పి తమ నేరమును తప్పించుకొనజూచిరిగాని, అట్లు చేయుటవలన అదిహెచ్చగునేగానితగ్గదు. అనేకులు ఈ దినములలో కూడ ఏదో ఒకవంక జెప్పజూతురు గాని వారి నేరము హెచ్చగునేగాని తగ్గదు.

# వారి శిక్షలు

1. సర్పమునకు నేలప్రాకుట, మన్ను తినుట. అప్పటి వరకు సర్పమునకు కాళ్లుండి యుండ వచ్చును.

2. స్త్రీకి ప్రసవవేదన

3. ఆదామునకు - చెమటూర్చుట

4. భూమికి - నీవలన భూమిని కూడ శపించు చున్నాను. విత్తనము లేక అవి గచ్చపొదలను ముండ్ల పొదలతోను నిండియుండును. మరియొక శిక్ష - తోట నుండితరిమి వేయబడుట. స్త్రీ, పురుషులిరువురు ఆకులతో తమ దిసములను కప్పకొనిరి. అయితే దేవుడు వారికి చర్మపు చొక్కాయిలు తయారు చేసెను. వారికి చర్మపు చొక్కా యిలిచ్చుటకు జంతువులను సంహరించవలయును. దేవుడట్ల జరిగించి యుండును. తరువాత కాలములో మానవుల పాపములను కప్పటకు దేవుడు తన కుమారుని ప్రాణమున చంపుట కది సూచన యైయుండును.

ఆతోటలో 3విధములైన చెట్లుగలవు

1. ఆహారమునకు పనికి వచ్చునవి అనేకములు గలవు.

2. మంచి చెడ్డలతెలివినిచ్చు చెట్టు

3. జీవ వృక్షము. ఇదియే మహా ప్రమాదము తెచ్చునది.

స్త్రీకి - హవ్వ అను పేరు ఆదాము యిచ్చెను. ఇంత వరకు ఆ పేరు లేదు. ఈమె జీవముగల ప్రతివానికిని తల్లి, జీవముగలువారెవరు? రక్షణ పొందు ప్రతివాడు జీవముగలవాడే. తల్లి ఎవరు? సంఘమే. ఇది ఆదాము నుండి వెలువడిన గొప్ప ప్రవచనము గదా. మన వంటివాడాయెను. మనము అను బహువచన మెవరికి చెందును ? మేము తండ్రి కుమార పరిశుద్ధాత్మలను త్రియేక దేవుడే గదా. అతడు చేయి చాపి , జీవవృక్ష ఫలములు తినును కనుక వానిని బయటకు తోలివేతును అని పలికెను.

జీవవృక్ష ఫలములు తింటే ఆదాము ఏమి కాగలడు ? మరణము అతనిముట్టదు అతని సంతానము తరతరములుండును. ప్రపంచము విమోచించబడలేని జనులతోనిండియుండును. అది ఎంత వింత ఘోరమైన దృశ్యము. ఆవిషయములో దేవుడు నిస్సహాయుడు. అది నివారించుటకై అనగా ఆదాము ఆ పండ్లు ముట్టకుండుటకై అతనిని తోట నుండి తరిమివేసి అటు ఇటు తిరుగు ఖడ్గజ్వాలను ఏర్పాటు చేసెను. ఇది మన యెడల దేవుని అపార ప్రేమ గదా. దేవుడు లోకమును ఎంతో ఎంతో ప్రేమించెను అనుట తగును గదా. ఏదేను తోటలో జీవవృక్ష ఫలములు మానవుడు తినకుండ అడ్డుపరచిన దేవుడు మనము పరిమపురికి చేరునప్పడు మనకై దాచియుంచిన జీవవృక్షఫలములకై ఆయనకు కృతజ్ఞత చెల్లింతము (ప్రకటన 22:2,14).

--- టి. జ్ఞానానందము, కాకినాడ

## ఆసక్తి జనకమైన బైబిలు వాస్తవములు

## ( Interesting Facts about the Bible)

బైబిలును 40మంది 1600సంవత్సరముల కాలములో అనగా క్రీ.పూ. 1503 నుండి క్రీ.శ.100వ సంవత్సరము వరకు వ్రాయుటలో నిమగ్నులైయుండిరి. ఈ మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై వ్రాసిరి (2పేతురు 1:21). వారు మనుష్య జ్ఞానము నేర్పు మాటలతో గాక ఆత్మనేర్పు మాటలతో వ్రాసిరి (1 కొరింథి 2:13).

బైబిలులో మొత్తము 66 పుస్తకములు, 1189 అధ్యాయములు, 31,102 వచనములు ఉన్నవి. ఇంగ్లీషు బైబిలు నందు 35,66480 అక్షరములు, 77,3746 మాటలు ఉన్నవి. పాతనిబంధనలో 39 పుస్తకములు క్రొత్తనిబంధనలో 27 పుస్తకములు ఉన్నవి. బైబిలు నందున్న ప్రతి మాటలోను సగటున అయిదు అక్షరములున్నవి. పెద్ద పెద్ద మాటలను వినియోగింప ప్రయత్నించు వానికి ఇది ఒక గొప్ప పాఠము.

'యెహోవా' అనుపదము 6,855 సార్లును, 'ప్రభువు' అనుపదము 1853 సార్లును అగుపడును.

ఇంగ్లీషు బైబిలులో 'And' అనుపదము 46277 సార్లు కన్పడును. 'రెవరెండ్' అనుమాట ఒకే ఒకసారి కన్పడును (కీర్తన 111:9).

ఎస్తేరు గ్రంథములో 10 అధ్యాయములున్నవి. గాని ప్రభువు అను పదముగాని, దేవుడు అనుపదము గాని అందులో కన్పించదు.

బైబిలు అంతటిలోను చిన్నదియు, మధ్యగాయున్నట్టియునగు అధ్యాయము 117వ దా. కీర్తన. అందులో కేవలము రెండు వచనములు మాత్రమే యున్నవి.

బైబిలులోని మధ్యవచనము కీర్తన 118:8.

యోబు 29వ అధ్యాయము పాతనిబంధనలో మధ్య అధ్యాయము. 2వ దినవృత్తాంతములు 20:13 పాతనిబంధనలో మధ్యవచనము.

1 దినవృత్తాంతము 1:25 పాతనిబంధనలో బహుచిన్న వచనము. అయితే ఎస్తేరు 8:9 అందున్న పెద్ద వచనము.

క్రొత్త నిబంధనలో మధ్యనున్న పుస్తకము 2 థెస్సలో నీకయులకు వ్రాయబడిన పత్రిక. రోమా 13, 14 అధ్యాయముల మధ్య క్రొత్త నిబంధనలో మధ్యనున్న అధ్యాయమున్నది. అపొ.కా. 17:17 క్రొత్తనిబంధనలో మధ్యవచనము. క్రొత్త నిబంధనలోను, బైబిలు అంతటిలోను బహుచిన్న వచనము యోహాను 11:35.

బైబిలులో పెద్దపదము యెషయా 18:1లో కన్పడును.

2 రాజులు 19అధ్యాయము, యెషయా 37వ అధ్యాయము ఇంచుమించు ఒకే రీతిగ యున్నవి.

బైబిలు మొట్టమొదటిగా అచ్చువేయబడిన గ్రంథము. అది 1450లో అచ్చు వేయబడెను. ఇండియాలో 1806లో హిందీలో లేఖనములు కొన్ని

మొదటిసారిగ ముద్రింపబడెను. 1811లో మొదటి క్రొత్త నిబంధన 1835లో బైబిలు అంతయును హిందీభాషలో ముద్రింపబడెను. హిందుస్థానీలోనికి తర్జుమా చేయబడిన మొదటి క్రొత్త నిబంధన 1900లో ముద్రింపబడెను.

1727లో తమిళంలో మొదటిగా బైబిలు ముద్రింపబడెను. 1854లో అది తెలుగులో అచ్చువేయబడెను.

1814లో ఉర్దూలో క్రొత్తనిబంధన మొదట ముద్రింపబడెను. 1843లో బైబిలు అంతయు ఉర్దూలో ముద్రింపబడెను.

విల్లియం కేరీ, హెన్రీ మార్టిన్, విల్లియం బౌలీ, తామస్ కోల్ బ్రూక్ అనువారలు మొదటి తర్జుమాదారులలో కొందరు.

1971లో 8072000 మందికి బైబిళ్లు, క్రొత్తనిబంధనలు, వాక్యభాగములు హిందూ దేశములో అందజేయబడెనని బైబిలు సొసైటీ ఆఫ్ ఇండియావారు తెలియజేసిరి.

గత కొద్ది సంవత్సరములలోను బైబిలు నాలుగు క్రొత్త భాషలలోనికిని, క్రొత్తనిబంధన రెండు భాషలలోనికిని, వాక్యభాగములు 15 భాషలలోనికి తర్జుమా చేయబడెను. వాటితో కలిపి భారతదేశములో బైబిలు 37 భాషలలోనికి క్రొత్తనిబంధన 24 భాషలలోనికి, వాక్యభాగములు 87 భాషలలోనికి తర్జుమాచేయబడెను.

ఆంగ్లములో King James Version బైబిలు 1611లో మొదట ప్రచురింపబడెను. 1885లో Revised Version తయారుచేబడెను.

కార్డినల్ హ్యూగో అనునతడు బైబిలును అధ్యాయములుగ విభజించెను. సర్ రాబర్ట్ స్టీవెన్స్ అనునతడు క్రొత్త నిబంధనను వచనములుగ 1551లో విభజించెను.

అధ్యాయములుగను, వచనములుగను విభజింపబడిన మొత్తము బైబిలు అంతయు 1560లో తయారయ్యెను. దానిని 'జెనీవా బైబిలు' అని

పిలుచుటకద్దు. సవరణోద్యమకారులచే (reformers) అది జెనీవాలో తయారుచేయబడెను గనుక దానిని అట్లు పిలిచిరి.

ప్రపంచములో పెక్కు భాషలలోనికి తర్జుమా చేయబడిన గ్రంథము బైబిలు. మరియే గ్రంథముకూడ అన్ని భాషలలోనికి ఎన్నడును తర్జుమాచేయడిన యుండలేదు. ప్రపంచమందంతటా బైబిలు గ్రంథమే ఎక్కువ అమ్ముడగుచున్న గ్రంథము.

మానవుని ఉద్భవమునుగూర్చి, అతని కృషినిగూర్చి అతని గతినిగూర్చి తెలియజేయు గ్రంథము అది ఒక్కటి మాత్రమే. రక్షణనుగూర్చి అది ఒక పాఠ్యపుస్తకమై యున్నది.

బైబిలునకును, విజ్ఞాన శాస్త్రవాస్తవములకును మధ్య విభేదములు ఏమియును లేవు, బైబిలునకుకు శాస్త్రజ్ఞులమని చెప్పకొనువారి సిద్ధాంతములకును విభేదములుండవచ్చును; లేదా విజ్ఞాన శాస్త్రపు వాస్తవములకును 'బైబిలుపండితులము' అని చెప్పకొనువారి సిద్ధాంతములకును విభేదములుండ వచ్చును.

అన్నిటికంటెపైగా బైబిలును చదివి, దానికి విధేయత చూపింపవలెను; దానిని బోధించవలెను.

--- జె.సి. ఛోట్

## పాత నిబంధన నేల చదువ వలెను?

## (Why Study the Old Testament)?

అపొ. పౌలు విశ్వాసమును బట్టి తన కుమారుడని యెంచిన యౌవన సువార్తికుడగు తిమోతికి ఈలాగున వ్రాసాడు : "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను సత్యవాక్యమును సరిగా ఉపదేశించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్త పడుము" (2 తిమో 2:15). ఇదే హెచ్చరికను ఈనాడు మనంకూడా వినాలి. దేవునివలన మెప్పు పొందేలాగ మనం మెలగాలి. అట్లు చేస్తే దేవుని యెదుట

యోగ్యునిగాను మన పనిలో సిగ్గుపడు నక్కరలేనివానిగాను మనం తయారగుదము. అయితే మనం దేవుని సంతోషపరచాలంటే యేమి చేయాలో, ఆయన మననుండి యేమి కోరుచున్నాడో తెలిసికోవాలంటే మనం ఆయన వాక్యాన్ని దీర్ఘంగా చదువుచూ ధ్యానిస్తూ యుండాలి.

క్రైస్తవులవలె మనం క్రొత్త నిబంధన యొక్క ప్రాముఖ్యతను ఎరుగకుండా యుండలేము. తత్ఫలితంగా మన బైబిలు పఠనమంటా క్రొత్త నిబంధనమీదే ఆధారపడి యున్నట్లగుపడుచున్నది. విచారకరమైన సంగతి యేమంటే మనలో చాలమంది పాత నిబంధనను యెరుగకున్నారు. దానిలోని వ్యక్తులనుగూర్చి చారిత్రక సంఘటనలను గూర్చి కొంత మట్టుకు మాత్రమే మనం ఎరిగి యున్నాము.

క్రొత్త నిబంధన పఠనము యొక్క ప్రాముఖ్యత గొప్పదే. ఈ అంత్యదినాల్లో మనం కృపవలన కలిగిన నిబంధన క్రింద యున్నాము. యేసుక్రీస్తునందలి విశ్వాసముద్వారా మనం రక్షణ పొందగల్గుచున్నాము గాని మోషే యుగంనాటి ధర్మశాస్త్ర పద్ధతుల ననుసరించి కాదు (ఎఫెసీ 2:1-11; యోహాను 1:17). మానవునికి దేవుని పరిపూర్ణమైన అంతిమ బయల్పాటే క్రొత్త నిబంధన. అందుకే అపో. పౌలు ఇట్లు చెప్పాడు : "మేము మీకు ప్రకటించిన సువార్తగాక మరియొక సువార్తను మేమైనను పరలోకమునుండి వచ్చిన యొక దూత యైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవును గాక. మేమిదివరకు చెప్పినప్రకార మిప్పుడును మరల చెప్పుచున్నాము; మీరు అంగీకరించిన సువార్త గాక మరియొకటి యెవడైనను మీకు ప్రకటించిన యెడల వాడు శాపగ్రస్తుడవును గాక" (గలతీ 1:8, 9). అది పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ (యూదా : 3).

క్రొత్త నిబంధన యొక్క ప్రాముఖ్యతను గూర్చి చెప్పుచు మనం పాతనిబంధన యొక్క పఠనాన్ని నిర్లక్ష్యం చేయుచున్నాము. అందువలన

దేవుని చిత్తముయొక్క బయల్పాటులోని సౌందర్యాన్ని, మాధుర్యాన్ని మనం తెలిసికోలేకపోవుచున్నాము. పాత క్రొత్త నిబంధనల సరియైన సంబంధాన్ని తెలిసికోలేకపోవుటవలన ఇది జరుగుచున్నది. దేవుని చిత్తం అంతటిలో ఈ రెండూ ప్రాముఖ్యమే.

లేఖనములన్నియు దైవావేశమువలన కలిగినవే. ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్చనుబట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి (2 పేతురు 1:21). క్రీస్తుయేసునందుంచ వలసిన విశ్వాసము ద్వారా రక్షణార్థమైన జ్ఞానము కలిగించే శక్తి లేఖనముల యందున్నదని చెప్పబడింది (2 తిమో 3:14). మరియు ఈ సత్యవాక్యాన్ని సరిగా విభజించిన యెడల దేవుని యెదుట యోగ్యునిగా కనబడే తరుణం మనకు దొరుకునని గమనించాం. ఈ వచనాలన్నీ బైబిలు యొక్క విలువను మనకు తెలియజేయుచున్నను, ప్రాధమికంగా వాటిలో చెప్పబడిన లేఖనములు పాతనిబంధన లేఖనములని మనం తెలిసికోవాలి. అందువలన పాతనిబంధనను చదువట మనం నిర్లక్ష్యం చేయరాదు.

## మనకు బోధ కలుగును

పాతనిబంధవలన మనకు బోధ కలుగు నిమిత్తము అది వ్రాయబడింది. "ఏలయనగా ఓర్పువలనను లేఖనములవలన ఆదరణవలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడినవన్నియు మనకు బోధకలుగు నిమిత్తము వ్రాయబడియున్నవి' (రోమా 15:4). దేవుడు మానవుని సృష్టించిన నాటి నుండి మొదలుకొని ఇశ్రాయేలీయులు బబులోను బానిసత్వము నుండి విడుదల పొందువరకు యున్న చరిత్రాత్మక రికార్డు అది. అది హెచ్చరించడానికి, గద్దించడానికి, బోధించడానికి ప్రయోజనకారియై యున్నది. తిరుగుబాటును గూర్చి అవిధేయతను గూర్చి మనలను అది హెచ్చరించుచున్నది (1 కొరింథీ 10:1-13). దేవునికి నమ్మకంగా సేవ చేయుట కది ప్రోత్సహించుచున్నది. "ఇంత గొప్ప

సాక్షి సమూహము మేఘమువలె మనలకు ఆవరించి యున్నందున మనము కూడ ప్రతి భారమును సులువుగా చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టి విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైన యేసువైపు చూచుచు మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము" (హెబ్రీ 12:1, 2). క్రొత్త నిబంధనలోయున్న దేవుడే పాతనిబంధనలోయున్న దేవుడు. ఆయన తన ప్రజలనుండి ఎల్లప్పడు విశ్వాసము విధేయతలనే కోరాడు. ఆయా సందర్భాలు, స్థలాలు మారవచ్చును గాని ఆయన యొక్క సుత్రాలు మాత్రం మారనివి.

## క్రొత్త నిబంధన అర్ధం చేసుకోగలం

ఇంకా, పాతనిబంధనను మనం చదివేకొలదీ క్రొత్త నిబంధనను అర్ధం చేసుకోడానికి వీలవుతాది. క్రొత్త నిబంధన యొక్క మూలం అంతా ఎక్కువ పాతనిబంధనలోనే వున్నది. పాతనిబంధనలోని వచనాలు, సందర్భాలు క్రొత్త నిబంధనలలో 650 సార్లు కంటె ఎక్కువ ఎత్తి చూపించబడినవి. పాత నిబంధనను కొంత వరకైనా ఎరుగకుండా క్రొత్త నిబంధనను మనం అర్ధం చేసుకొనలేము. పాతనిబంధనను మనం అర్ధం చేసుకొనే కొలదీ క్రొత్తనిబంధనను అర్ధం చేసుకొగలం.

## చారిత్రక వాస్తవములు

చరిత్రలోని వాస్తవాలను మనకు పాతనిబంధన అందజేయుచున్నది గనుక దాన్ని మనం చదవాలి. చరిత్రాత్మక విషయాల్లో పాతనిబంధన నమ్మతగినదని, యధార్ధమైనదని యేసే మనకు తెలియజేసాడు. (మత్తయి 19:4; 22:29). దేవుని యొక్క ఉనికిని గూర్చి సృష్టినిగూర్చి, మానవుని ఆరంభాన్ని గూర్చి, జలప్రళయాన్ని గూర్చి మొదలైన అట్టివాటిని గూర్చి మనకు ఖచ్చితమైన సమాచారం ఇంకెక్కడదొరకును? వీటిని గూర్చి అక్కడక్కడా మనకు కొంత సమాచారం దొరుకుతుందిగాని అది అంత నమ్మతగినది, అధికార యుక్తమైనదికాదు. పాతనిబంధన యధార్ధమైనది మాత్రమే

కాదుగాని అది అధికార యుక్తమైనది. ఆత్మావేశముచే లిఖింపబడిన సత్యమని నిరూపించుకొన్నది.

పాత నిబంధన ఈ లోకరక్షకుడగు యేసుక్రీస్తును సూచించుచున్నందున ముఖ్యంగా దాన్ని మనం పఠనం చేయాలి. మోషే ధర్మ శాస్త్రాన్ని నిత్యము ఉండేదిలా దేవుడు ఉద్దేశించలేదని పాతనిబంధన విపులంగా బయలుపరుచుచున్నది. “ఇదిగో నేను ఇశ్రాయేలు వారితోను యూదా వారితోను క్రొత్త నిబంధనచేయు దినములు వచ్చుచున్నది....” యని ఆయన చెప్పారు. (యిర్మియా 31:31-34). మోషేధర్మ శాస్త్రము ఒక ప్రత్యేక ప్రయోజనంకొరకు తాత్కాలికంగా ఉద్దేశించబడినదని అపొ. పౌలు చెప్పాడు. ఆ ప్రయోజనం నెరవేరిన తరువాత దాని అవసరత ఇక లేకపోవును (గలతీ 3:10-25).

మెస్సీయను గూర్చి ఆయన రాజ్యాన్ని గూర్చి పాతనిబంధనలో 400 కంటే పైగా ప్రవచనములున్నవి. అంతేగాకుండా దానిలోని కొన్ని సందర్భములు, వ్యక్తులు, సంస్థలు క్రీస్తుకు మాదిరిగాను, రాబోవుసంగతుల ఛాయగానుయున్నవి. “లేఖనములయందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుడి. అవే నన్ను గూర్చి సాక్ష్య మిచ్చుచున్నవి' యని యేసుప్రభువు చెప్పారు (యోహాను 5:39).

వీటన్నిటినిబట్టి పాతనిబంధనను చదువుట అవుసరం అని మనం గ్రహించుకోగలము. మనం పాతనిబంధనకు బద్ధులము కాకపోయినను దాన్ని చదువుట అత్యవసరం. క్రీస్తు ప్రభువును, ఆయన రక్షణమార్గాన్ని, ఆయన సంఘాన్ని మరింత అర్థంచేసుకోవాలంటే పాతనిబంధన లేఖనాలను చదువుట అవుసరం. “కావున మనము వినిని సంగతులను విడిచిపెట్టి కొట్టుకొని పోకుండునట్లు వాటియందు మరి విశేష జాగ్రత్తకలిగి యుందము' (హెబ్రీ 2:1)

---- జాషువాగూటం

# బబులోను హెచ్చరిక

## (The Warning of Babylon)

"అప్పడు రాజ్యములకు భూషణమును కల్దీయులకు అతిశయాస్పదమును మహోత్స్యమునగు బబులోను దేవుడు పాడుచేసిన సొదొమగొమొర్రాల వలెనగును. అది మరెన్నడు నివాసస్థలముగా నుండదు. తరతరములకు దానిలో ఎవడును కాపురముండడు. అరబీయులలో ఒక్కడైనను అక్కడ తన గుడారము వేయడు, గొర్రెల కాపరులు తమ మందలను అక్కడ పరుండనియ్యరు, నక్కలు అక్కడ పండుకొనును, గురుపోతులు వారి యిండ్లలో ఉండును. నిప్పుకోళ్ళు అక్కడ నివసించును కొండమేకలు అక్కడ గంతులువేయును" (యెష 13:19-21).

బహుశ బబులోను కంటె సుందరమైనది, గొప్పదైనది మరొక పట్టణము లేదు. అది బహు పురాతనమైన పట్టణం, అది బహుశ ఆదికాండము 11:9లో చెప్పబడిన బాబెలుపురము కావచ్చును. 'బబులోను' అనగా దేవుని గుమ్మము అని యర్థము. బాబెలు అంటే తారుమారు అని యర్థము. లేఖినములలో దానికున్న ప్రాముఖ్యత అట్టిది.

బబులోను మహాపట్టణాన్ని వర్ణించుటకు మనకు స్థలము చాలదు గాని అది చతురస్రాకారముగ కట్టబడెను. దానికి నాలుగు ప్రక్కల 325 అడుగుల ఎత్తు, 85 అడుగుల మందముగల గోడలు కట్టబడెను. ఒక్కొక్క గోడ 15 మైళ్ళ పొడవుండెను. ఒక్కొక్క గోడలో 15 పెద్ద యిత్తడి మ్మములుండేవి. ప్రతి గుమ్మము నుండి దానికి ఎదురుగా యున్న గోడలోని గుమ్మము వరకు విశాలమైన వీధులుండేవి. ఈ విధంగా పట్టణమంతా 576 పెద్ద చతురస్ర భాగాలుగా విభజింప బడ్డాయి. వీటి లోపలి స్థలములు తోటలుగా చేయబడితే, బయట అంచులలో యిండ్లు నిర్మించబడ్డాయి.

నాటి విజ్ఞాన శాస్త్రములోని ప్రతిశాఖ అక్కడే ఆరంభించబడెను గనుక, తూర్పుదేశపు నాగరికత అంతా, నెలలు, వారములు, సంవత్సరములు,

సమయము మొదలగువాటి లెక్క కొరకు బబులోను మహాపట్టణము వైపే చూచేవారు. సూర్యగడియారములను (Sun Dials) నీటి గడియారములను ఐగుప్తు బబులోనునుండి తీసుకొని వెళ్ళేది. అది ఎంత ఘనకీర్తి నొందిన పట్టణమంటే అది ఎన్నడు నాశనం కాదని దాని రాజులు ప్రజలు తలంచేవారు. గాని వారు తప్పు! వారు అజాగ్రత్త పరులయ్యారు. పాపభోగాలలో మునిగిపోయి, వారు దేవుని మరచారు. దేవుడు ఈ మహా పట్టణముపై తన తీర్పును ప్రకటించాడు. దేవుడేమైతే శాసించాడో దానిని నెరవేరుస్తాడని బబులోను గూర్చిన హెచ్చరిక మనకు తెలియజేయుచున్నది. దేవుడెంత ఖచ్చితంగా తీర్పు చెప్పాడో అంత ఖచ్చితంగా పూర్తిగా అది నెరవేరింది. అది నాశనము చేయబడతాదని ప్రవక్తలు ముందుగనే హెచ్చరిక చేసారు, గాని ప్రజలు దానిని ఖాతరు చేయలేదు.

బబులోను మహాపట్టణం నాశనం చేయబడింది. అట్లే నేడు దేవుని మరచి ఆయనకు అవిధేయత చూపుచు జీవించు వారందరు నాశనమవుతారు. గతంలో దేవుడిచ్చిన హెచ్చరికల దృష్ట్యా ఇప్పుడు మనం ఆయనకులోబడుటకు ప్రోత్సహింపబడాలి. నీవు మరణం, తీర్పు, నాశనములను గూర్చి ఎన్నడైనా ఆలోచించావా ? పరలోకానికి నరకానికి గల తారతమ్యాన్ని ఎన్నడైనా గమనించావా ? ఒకడు పరలోకాన్ని పోగొట్టుకొంటే, అంతా పోగొట్టుకొన్నట్లే. మరణం వస్తాదని ఆ తరువాత తీర్పు జరుగునని అందరు ఎరిగినదే. అయితే మనం చేసిన పొరబాటు మరణించిన తరువాత తెలిసికొన్నట్లయితే దానిని రైటు చేయడానికి ఇక సమయం యేమి వుండదు. ఎందువలనంటే మరణానంతరం ఇకవున్నది తీర్పే.

--- రోబర్ట్ M. వాలర్

గమనిక : సత్యవాక్కు వలయువారు సంవత్సరమునకు 30/- రూ॥లు చందా పంపిచవలయును.

Satya Vani, P.O.Box - 80, Kakinada - 533 001.

ప్రార్థించమనవి. పై ప్రాంతములలో బాప్తిస్మము తీసికొన్న వారిలో అనేకులు బేసిక్ బైబిలు కోర్సును పూర్తి చేసినవారున్నారు.

2002 నవంబరు 4వ తేదీ సోమవారం నాడు ఏలూరులో జరిగిన ఒక స్తుతికూటములో జాషువాగూటంగారు వాక్యపరిచర్య చేసిరి. గౌరవనీయులు పి.జె.కె. చార్లెస్ గారి 80వ జన్మదిన సందర్భముగా ఆకూటము ఏలూరులో జరిగెను.

నవంబరు 6వ తేదీ బుధవారం రఘుదేవపురంలో జరిగిన సువార్త కూటములో జాషువాగారు వాక్యపరిచర్య చేయగా 5గురు క్రీస్తు సువార్తకు లోబడుటకు ముందుకు వచ్చిరి. రఘుదేవపురంలో సోదరులు ఎమ్. కృపానందము గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

నవంబరు 10వ తేదీ ఆదివారం రాత్రి Z- రాగంపేటలో జరిగిన సువార్త కూటములో జాషువాగారు వాక్యపరిచర్య చేసిరి. అక్కడ బి. డేవిడ్‌రాజు గారు దేవుని పనిచేయుచున్నారు. అక్కడ జరుగుచున్న పనిలో సోదరులు ఆనందరావ్‌గారు ఆయనకు సహకరించుచున్నారు. 13వ తేదీ బుధవారం చదలాడలో జరిగిన బైబిలు తరగతిలో సోదరులు జాషువాగారు వాక్యోపదేశముగావించిరి. ఆరోజు 'ప్రభురాత్రి భోజనము' అను అంశమును గూర్చి ఆయన ఉపదేశించిరి.

నవంబరు 15వ తేదీ శుక్రవారం తొత్తరమూడి గూంటూరు వాని పేటలో ఉదయం జరిగిన సువ్తా కూటములో సోదరులు వి. రాజకుమార్, యన్. ఏలియా, డి. ఇశ్రాయేలు రాజు, జాషువా గూటం గార్లు వాక్యపరిచర్య చేసిరి. అనంతరం 4గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. గుంటూరు వానిపేటలో సోదరులు దొగ్గసామ్మేలుగారు చాల కాలము నుండి సువార్త చాటుచున్నారు. అటు తరువాత సాయంత్రం 3:30 గంటలకు సోదరులు జాషువా గారు వాడపర్రువెళ్లి అక్కడనున్న స్థానిక సంఘములో వాక్యపరిచర్య చేసిరి. వాడపర్రులోను, గొల్లవిల్లిలోను సోదరులు డి. రంగారవ్ గారు సువార్త చాటుచున్నారు.

## గమనిక

సత్యవాణి టి.వీ కార్యక్రమాలను 2003 జనవరి 4వ తేది నుండి ప్రతి శనివారం ఉదయం 6:30 నుండి 7:00 గంటల వరకు **తేజ టి.వీ** (ఛానల్)లో చూడండి. మీ బంధువులు, మిత్రులు తేజ ఛానల్‌లో వినిపించ బడుచున్న సత్యసువార్తను వినేలాగున వారిని ప్రోత్సహించండి

ప్రసంగీకులు : జాషువాగూటం


*from:*

**SATYA VAKKU**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**



RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/2002

Edited & published by Joshua Gootam & published at SATYA VANI, Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.